క్లుప్తంగా

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో జగన్నాథస్వామి

భీమునిపట్నం: జగన్నాథస్వామివారి రథోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఈ అవతారం విశిష్టతను వివరించారు.

కుసులువాడలో రీ సర్వే ప్రారంభం



కుసులువాడలో రీసర్వే చేస్తున్న సర్వే బృందం

ఆనందపురం: మండలంలోని కుసులువాడలో సమగ్ర భూ సర్వే శుక్రవారం ప్రారంభమైంది. సర్వే బృందం పొలాల్లో పర్యటించింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కుసులువాడలో మొత్తం 4561 ఎకరాల విస్తీర్ణం ఉంది. అందులో 1144 ఎకరాల జిరాయితీ, 3417 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు వద్ద ఉన్న హక్కు పత్రాలతో హాజరై సర్వే బృందాలకు చూపించాలన్నారు. రైతులు చూపించిన మేరకు భూములకు కొలతలు వేసి రికార్డు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో స్వామి, సర్వేయర్లు గణేష్, చంద్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రూరల్ ఎంఈవో-2గా అనురాధ



అనురాధ

మధురవాడ: విశాఖ రూరల్ మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో)-2గా పి. అనురాధ బాధ్యతలు చేపట్టారు. ఈమె కె. కోటపాడు మండలం అలమండ కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకడమిక్ మానటరింగ్ కార్యకలాపాలు చంద్రంపాలెం ఎంఆర్‌సీ భవనం నుంచి సాగుతాయన్నారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని సూచించారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు రేపు పౌరసన్మానం

తగరపువలస: కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పత్రి శివానంద్‌కు ఆదివారం ఉదయం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో పౌర సన్మానం జరగనుంది. చిట్టివలసకు చెందిన శివానంద్‌ను ఘనంగా సత్కరించడానికి ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొనాలని ఆయన కోరారు.

'ఆ భూములు కొనవద్దు'

తగరపువలస: కోర్టు వివాదాల్లో ఉన్న చిట్టివలస జూట్‌మిల్లు భూములను కొనుగోలు చేయవద్దని టీడీపీ జిల్లా కార్యదర్శి పిట్టా సురేష్ కోరారు. కొత్తపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించకుండా మిల్లు ఆస్తులు విక్రయిస్తున్న యాజమాన్యంపై కోర్టులో కేసులు ఉన్నాయన్నారు. అయినప్పటికీ దళారుల సాయంతో లొసుగులు కప్పిపుచ్చి అమాయకులైన ప్రజలకు అధిక ధరలకు మిల్లు స్థలాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తమ్మిన సూర్యప్రకాష్, పిల్లా రాజేష్, జోగ సన్యాసిరావు, దిండి వెంకటేష్, పల్లా అప్పలకొండ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ లబ్ధి



హాజరైన సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, అధికారులు



జగనన్న సురక్ష కార్యక్రమంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- దేశానికే రోల్ మోడల్‌గా సీఎం జగన్
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష

పీఎం పాలెం: అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను నేరుగా అందజేసి ఇతర రాష్ట్రాల పాలకులకు రోల్ మోడల్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాల్‌లో సచివాలయాల సిబ్బంది, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.5 వేలు ఉంటే.. ఈ నాలుగేళ్ల జగనన్న పాలనలో రూ.12 వేలకు పెరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనకు సీఎం వైఎస్ జగన్ పాలనకూ పోలికే లేదన్నారు. పట్టణ ప్రాంతాల్లో 82 శాతం కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో 92 శాతం కుటుంబాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నాయని వివరించారు. 75 శాతం మంది ప్రజలు జగనన్న పాలనను మళ్లీ కావాలనుకుంటున్నారని, వలంటీర్లు అందిస్తున్న సేవలను బట్టి ఇది వ్యక్తమవుతోందని చెప్పారు. 11 రకాల సమస్యలను అనతి కాలంలోనే పరిష్కరించడానికి వీలుగా ప్రభుత్వ సిబ్బందే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. వలంటీర్లకు అప్పగించిన విధులను తూచా తప్పకుండా పాటించి సీఎం జగన్ ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిన మంచి అవకాశంగా భావించాలని కోరారు. మధురవాడ జోన్ 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు హాజరైన ఈ సమావేశానికి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి అధ్యక్షత వహించారు.

జగనే మళ్లీ సీఎం..

భీమిలి నియోజకవర్గ పరిశీలకుడు బాలరాజు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన దూరదృష్టికి అనుగుణంగా ఉత్తమ సేవలు అందించి తమ వంతు బాధ్యతలు నెరవేర్చాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనర్ బి.రాము, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాతా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్, పార్టీ 5, 6, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, 6వ వార్డు అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, సీనియర్ నాయకులు జె.ఎస్.రెడ్డి, పోతిన ప్రసాద్, పిల్లా సూరిబాబు, కుడితి రామారావు, జామి శివకుమార్, కృష్ణమూర్తి పాత్రుడు, నాలుగు వార్డుల సచివాలయాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం మహా లింగార్చన



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తగరపువలస: లోక కల్యాణార్థం ఒకటోవార్డు బంగ్లామెట్ట శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ, అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో మహా లింగార్చన, మహా రుద్రాభిషేకం నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సకాలంలో కురవాలని తగరపువలస, చిట్టివలస, సంగివలస గ్రామాలకు చెందిన అర్చకులు ఈ క్రతువు చేపట్టారు. ఉదయం 6నుంచి సాయంత్రం7 గంటల వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సంఘ పెద్దలు రామాయణం బుచ్చికామేశ్వర శర్మ, మధిర రమణ, దార్లపూడి కైలాసం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అందవిల్లి నరసింహ పంతులు, భోగాపురపు శ్రీనివాస కార్తికేయ శర్మ, మూలా శర్మ, నేరెళ్ల విశ్వేశ్వరరావు, పెంట వెంకటరమణ శర్మ(కోశాధికారి), నేతేటి శేషగిరి, చిట్టిల్ల శ్యామ్ , ఏడిద కార్తీక్‌శర్మ, బొల్లా ప్రగడ రమణమూర్తి, బూరాడ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించడం మన బాధ్యత



శాలువాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: భారతీయ సంప్రదాయ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళల ప్రదర్శన- విక్రయాల స్టాల్స్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. చేతితో తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. స్టాల్స్ నిర్వాహక ప్రతినిధి మాట్లాడుతూ శిల్పారామంలో ఏర్పాటు చేసిన 60 స్టాల్స్‌లో దేశంలోని 20 రాష్ట్రాల్లో తయారైయిన హస్తకళల ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. కార్యకమంలో నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత,సత్యనారాయణ,శిల్పారామం ఏవో విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పే



ప్లకార్డులతో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవీఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ భవిష్యత్ తరాలకు చాలా ప్రమాదకరంగా తయారవుతుందని, దాని నిర్మూలనే ఏకైక మార్గం అన్నారు. డ్రై డ్రైడే, సీజనల్ వ్యాధులు, తడి పొడి చెత్త, ప్రమాదకర చెత్త వాటి విభజన, రీసైక్లింగ్ తదితర అంశాల గురించి వివరించారు. మూడు వేలు మందికి ఒకే సారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు, జీవీఎంసీ పీవో రమణమ్మ, డీపీవో ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారాం, సెక్రటరీ మంగరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భీమునిపట్నం: జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి ఆ పార్టీ కన్వీనర్ రామానాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, నాయకులు పోలుబోతు విజయ, అప్పికొండ ఆదినారాయణ పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభంలోని బీజేపీ మండల శాఖ కార్యాలయంలో శుక్రవారం శ్యామ్ ముఖర్జీ చిత్రపటానికి ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారావు, హెచ్. మహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదర్శనీయుడు

మధురవాడ: జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ నేటి తరానికి ఆదర్శనీయుడని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. 7వ డివిజన్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిధాన్ దివస్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్డు శక్తి కేంద్రం ప్రముఖ్ జి.అప్పారావు నివాసం వద్ద ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు యూవీ కొండలరావు, ఉదయ్‌భాస్కర్, పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం లైవ్‌ను వీక్షించిన నాయకులు

పద్మనాభం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు వీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఈ ప్రసారాన్ని వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

క్షయ గుర్తించడంపై అవగాహన

భీమునిపట్నం: పిల్లల్లో క్షయవ్యాధి గుర్తించడంపై శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలకు ఈ సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. పిల్లలకు రెండువారాల పాటు దగ్గుతో పాటు సాయంత్రం జ్వరం వస్తున్నా బరువు తగ్గినా వెంటనే క్షయవ్యాధి పరీక్షలు చేయించాలని సూచించారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్‌లోని పని చేసి వివిధ స్టేషన్లకు బదిలీ అయిన సిబ్బందిని శుక్రవారం రాత్రి చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో సత్కరించారు. కార్యక్రమంలో భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

పీఎం పాలెం: జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలోని నూతనంగా ఎంపికైన వార్డు వలంటీర్లకు శుక్రవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్‌లోని 5,6,7,8 వార్డుల పరిధిలో నూతనంగా 65 మంది వార్డు వలంటీర్లను నియమించినట్టు చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన గొప్ప అవకాశంగా భావించి ఉత్తమ సేవలు అందించాలని వలంటీర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్సీ కనకమహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

పీఎం పాలెం: ప్రేమించి పెళ్లి చేసుకుందామనుకున్న యువతి నిరాకరించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా.. నెల్లూరుకు చెందిన అరిగెల సాయి కుమార్(32)కు పార్వతీపురానికి చెందిన ఓ యువతి మ్యారేజీ బ్యూరో ద్వారా పరిచయమైంది. ప్రస్తుతం ఆ యువతి నగరంలో ఉద్యోగం చేస్తోంది. కొద్ది నెలలుగా వారు ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట నగరంలోని ఓ కన్వెన్షన్‌లో సాయికుమార్ రూమ్ తీసుకుని ఉంటున్నాడు. నెల్లూరు ప్రాంతం వ్యక్తి అయినందు వల్ల తన కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించడం లేదని ప్రియురాలు అతడితో చెప్పింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సాయికుమార్ గదిలో శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని మేనమామ అరుణ చంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి

ఆనందపురం: నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత పాటిస్తేనే వ్యాధుల బారిన పడకుండా ఉంటామని సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి చెప్పారు. మండలంలోని కుసులువాడ ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం మలేరియా మాసోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా 24 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆర్థిక ప్రోత్సాహంతో పాటు, టబ్బు, మగ్గు, సబ్బు, ఆయిట్‌మెంట్‌లతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వై.నూకరాజు, ఆరోగ్య పరిరక్షణ అధికారి పి.సన్యాసిరావు, డి.పార్వతమ్మ, సీహెచ్‌వో స్వర్ణలత పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఫేక్ ఐడీ తయారీ ముఠా

అల్లిపురం: వేర్వేరు కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులకు బెయిల్ ఇచ్చే వ్యక్తులకు ఫేక్ ఐడీలు, ఆధార్ కార్డులు సృష్టించి వేలకు వేలు దండుకుంటున్న ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాణిపేట పరిధి తాడివీధిలో లక్ష్మి అనే మహిళ సహా నలుగురు వ్యక్తులు బెయిల్, పూచీకత్తుల కోసం ప్రయత్నించే వారే లక్ష్యంగా ఫేక్ ఐడీలు, డాక్యుమెంట్లు తయారు చేసి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించిన పోలీసుల బృందం ఒకటి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఇంకా ఎంత మంది ఉన్నదీ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న డీసీవో రూపావతి

మధురవాడ: విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిస్తే అన్ని చోట్లా గౌరవం దక్కుతుందని విశాఖ, అనకాపల్లి జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి చెప్పారు. కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో శుక్రవారం 10వతరగతిలో 588 మార్కులు సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా జగనన్న ఆణిముత్యాలు పురస్కారం అందుకున్న పాఠశాలకు చెందిన ఎస్. మోదప్రియాంక, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరచిన వై. జస్సికా, ఇవాంజలిను అభినందించారు. అనంతరం జగనన్న విద్యా దీవెన కిట్స్ విద్యార్థినులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. నాగమణి, 7వ వార్డు వైఎస్సార్‌సీపీఅధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ పలివెల రవికుమార్, రిక్షా కాలనీ అధ్యక్షుడు జోగారావు, సచివాలయ కన్వీనర్ కొండమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



బోయిపాలెంలో సంక్షేమ పథకాల కరపత్రాలు లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం: గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని గంభీరం, బోయిపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను గణాంకాలతో సహా వివరించారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలను అందించామని చెప్పారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ కొత్త ఆలోచన చేసి జగనన్న సురక్ష పథకానికి రూపకల్పన చేశారని చెప్పారు.

భూ సర్వేతో వివాదాలకు చెక్

చాలా ఏళ్లుగా భూ సర్వే జరగక పోవడంతో రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రీ సర్వే చేపట్టి తప్పులు లేకుండా రికార్డులు రూపొందిస్తారని చెప్పారు. దీని వల్ల భూ వివాదాలకు చెక్ పడుతుందన్నారు. కాలువలు, ఇళ్లు, రోడ్లు కావాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, ఎంపీటీసీ సభ్యురాలు బొట్టా ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ బోయి వెంకటరమణ, పార్టీ సీయూసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, నాయకులు బొట్టా రామకృష్ణ, బంటుబిల్లి మణిశంకర నాయుడు, ఉప్పాడ సూరిబాబు, కిల్లి కిరణ్, తెడ్లాపు గోవింద్, పిన్నింటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'తల్లి ప్రేమతో అనాథ పిల్లల పెంపకం'



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

భీమునిపట్నం: అనాథ పిల్లలను తల్లిప్రేమతో పెంచి ప్రయోజకులను చేయడం ఎంతో గొప్ప విషయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ఎస్‌వోఎస్ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా ఎస్‌వోఎస్ వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ చిత్రపటానికి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడున్న పిల్లల సంరక్షణ ఎంతో బాగుందని కొనియాడారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, ఎస్‌వోఎస్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలపైనే..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీలో నిర్వహించిన 'టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం'లో వచ్చిన ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపైనే అందాయి. ఓపెన్ ఫోరంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక అధికారి సునీత డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు సమష్టిగా పని చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ తదితరులు

దొండపర్తి : మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని వ్యవస్థలు సమష్టిగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ సూచించారు. డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను సీపీ శుక్రవారం తన కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సమర్థవంతంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో దాడులు పెంచడం ద్వారా మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టే విధంగా మరింత సమర్థవంతంగా పని చేయాలని ఎస్ఈబీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఏఈఎస్ బి.శ్రీనాథుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు మండల స్పెషల్ ఆఫీసర్లు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల(ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యే విధంగా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. పద్మనాభంకు ఎన్‌హెచ్-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ), భీమునిపట్నంకు ఆ డివిజన్ ఆర్డీవో, ఆనందపురానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్ఆర్సీ), విశాఖ రూరల్‌కు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ), సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. అలాగే గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.

రుషికొండలో బోటు షికారు నిలిపివేత



తీరానికి పరిమితమైన బోట్లు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో బోటు షికారును నిలిపివేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అలల ఉధృతి, ఈదురు గాలులు అధికంగా ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బోటు షికారును నిలిపివేశారు. వాతావరణం అనుకూలించిన వెంటనే యథావిధిగా అందుబాటులోకి తెస్తామని నిర్వాహకుల తెలిపారు.